నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | బుధవారం 6 మార్చి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

## చివరి ఆయకట్టుకు పారేదెన్నడు?

**ధర్మసాగర్ నార్త్ కెనాల్ నుంచి అందని సాగునీరు**

**పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన**

ఎల్కతుర్తి, మార్చి 5 : దేవాదుల నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్ ద్వారా నార్త్ కెనాల్‌కు సాగునీరు రాక చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. దీంతో అదునుకు నీరందక పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నార్త్ కెనాల్ ద్వారా ఎల్కతుర్తి మండలంలోని దామెర, జీల్గుల, జగన్నాథపూర్, పెంచికల్‌పేట, భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి, ముల్కనూరు, హుజూరాబాద్ మండలం కాట్రపల్లి, దమ్మక్కపేట వరకు సాగునీటిని అందించేలా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాల్వలను తవ్వారు. అయితే ఏ రోజు కూడా ఈ కాల్వల ద్వారా రైతులకు సాగునీరు అందలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాతే అప్పటి హుస్నాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు నీటిని విడుదల చేశారు. ఫలితంగా రైతులకు సక్రమంగా సాగునీరందడమే గాక ఆ నీటితోనే పలు గ్రామాల చెరువులను నింపుకొనేవారు. చెరువుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నందున తాగునీటికీ సమస్య రాలేదు. ప్రస్తుతం భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి తీవ్ర స్థాయిలో నీటి ఎద్దడి ఏర్పడింది. నార్త్ కెనాల్ ద్వారా దేవాదుల నీళ్లు వస్తున్నా చివరి గ్రామాలకు అందడం లేదు. దీంతో యాసంగిలో ఆయకట్టు కింద వేసిన వరి, మక్కజొన్న తదితర పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. గతంలో ఇదే సీజన్‌లో కావాల్సిన నీళ్లు అందడంతో పంటలు పండాయని, ఇప్పుడు నీళ్లు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై దేవాదుల డీఈ ప్రశాంతిని వివరణ కోరగా, సరిపడా సిబ్బంది లేక సమస్య వస్తున్నదని, చివరి గ్రామం వరకు నీరందించేలా చూస్తామని చెప్పారు.



నీళ్లు అందక ఎండిపోతున్న పంటలు



చిట్యాల మండలం నవాబుపేటలో వ్యవసాయ బావిలో అడుగంటిన భూగర్భ జలాలు

అన్నదాతలకు మళ్లీ పాత రోజులు వస్తున్నాయి. చెరువులు, కుంటల్లో నీళ్లు అడుగంటి.. బోర్లు, బావులు ఎండిపోయి సాగుపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఓవైపు మానేరు ఎండిపోవడం, డీబీఎం 38 కాలువ ద్వారా ఎస్సారెస్పీ నీళ్లు రాకపోవడంతో వ్యవసాయానికి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లందించి వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేస్తే ప్రస్తుత ప్రభుత్వం పట్టింపులేని తనంతో కళ్లెదుటే పంటలు ఎండిపోతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంటున్నది.



# అడుగంటిన ఆశలు

## కానరాని సాగునీళ్లు.. ఆందోళనలో రైతులు

### ఎండిన మానేరు.. దిక్కులేని ఎస్సారెస్పీ జలాలు

- **జయశంకర్ జిల్లాలో యాసంగికి తీవ్ర నీటి కష్టాలు**
- **తాగునీటికీ తప్పని తిప్పలు.. వెలవెలబోతున్న డీబీఎం-38 కాలువ**
- **0.72 మీటర్ల లోతుల్లోకి భూగర్భ జలాలు.. ఎండాకాలం పరిస్థితి తీవ్రం**

జయశంకర్ భూపాలపల్లి, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. ఎండాకాలం ముందే జలం పాతాళానికి పడిపోతుండడం ప్రజలను, రైతులను కలవరపెడుతున్నది. యాసంగి పంటలకే కాకుండా తాగునీటికీ తిప్పలు తప్పేలా లేవు. ప్రస్తుతం ఆవరేజీగా 0.72 మీటర్ల లోతుల్లోకి భూగర్భజలాలు పడిపోయాయి. భూపాలపల్లి, మల్హార్ మండలాల్లో భారీగా అడుగంటాయి. గతేడాది జనవరి, గడిచిన జనవరితో పోలిస్తే 0.72 మీటర్ల లోతుల్లోకి నీటిమట్టం పడిపోయింది. యాసంగిలో భారీగా పంటల అంచనాలను రూపొందించుకున్న వ్యవసాయశాఖ ఇప్పుడు అంచనాలను మార్చుకునే పరిస్థితి వచ్చింది. ఎండలు ముదిరితే నీటి కష్టాలు ఎక్కువయ్యే అవకాశాలున్నాయని భూగర్భ జలశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వారు ప్యూజోమీటర్ ఆధారంగా విడుదల చేసిన నివేదికలు రానున్న రోజుల్లో పొంచి ఉన్న నీటి ఇబ్బందులకు సంకేతాలిస్తున్నాయి. గత జనవరి(2023)లో 7.26 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ నీటి మట్టం ఈ జనవరిలో(2024)లో 7.98 మీటర్లకు పడిపోయింది. గతేడాది జిల్లాలో 84వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు కాగా ఈ యాసంగిలో 75వేల ఎకరాలకే పరిమితమైంది. గతేడాది 11వేల ఎకరాల్లో ఆరుతడి పంట అయిన మక్కజొన్న సాగు కాగా ఈసారి 15వేల ఎకరాల్లో సాగవుతోంది. నీటి సమస్యతో రైతులు వరి సాగు తగ్గించి మక్కజొన్న వైపు మళ్లుతున్నారనేందుకు ఇది నిదర్శనంగా నిలిచింది.



ఎల్లంలలో నీరులేక బావిలో క్రేన్ ఏర్పాటు చేసి పూడిక తీయిస్తున్న మాజీ ఎంపీటీసీ చంద్రయ్య



రేగొండ వద్ద వెలవెలబోతున్న డీబీఎం 38 కాలువ

### ఆదుకున్న కాళేశ్వరం

కాళేశ్వరం ప్రాజెక్టుతో గతేడాది చెరువులు, కుంటలు నిండి బోర్లు, బావుల్లో జలాలు పెరిగాయి. పంటల విస్తీర్ణం సైతం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి నీళ్లు రాక బోర్లు, బావుల్లో నీటి మట్టం తగ్గి సాగుపై ప్రభావం చూపుతున్నది. ఎస్సారెస్పీ నీరు రాక డీబీఎం 38 కాలువ వెలవెలబోతున్నది. ఈ కాలువ రేగొండ మండలం వద్ద ప్రారంభమై టేకుమట్ల మండలంలో ముగుస్తుంది. మొత్తం 44 వేల ఎకరాలకు సాగునీరందిస్తుంది. కేసీఆర్ ప్రభుత్వంలో డీబీఎం 38 కాలువ ద్వారా సాగునీరు సమృద్ధిగా అందింది. ప్రస్తుతం సాగునీటికి రైతులు తండ్లాడుతున్నారు. మరో 15 రోజులు గడిస్తే నీటిగోస అధికమయ్యే ప్రమాదముందని వాపోతున్నారు.



నీళ్లులేక ఎండిన వరిని మేస్తున్న గొర్రెలు

## గొర్రెలకు మేతగా వరి పైర్లు

**సాగునీరందక రైతుల పాట్లు**

లింగాలఘనపురం, మార్చి 5 : దశాబ్దం క్రితం కనిపించిన కరువు మళ్లీ తాండవిస్తున్నది. ఓ వైపు దేవాదుల రిజర్వాయర్ నుంచి నీరు అందక, మరో వైపు భూగర్భ జలాలు అడుగంటడంతో సాగునీటి సమస్య నెలకొంది. బోరు బావుల్లో నీరు లేకపోవడంతో జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలో వరి పొలాలు ఎండిపోతున్నాయి. యాసంగిలో వరి నార్లు పోసిన రైతులకు నిరాశే ఎదురైంది. భూగర్భ జలాలు తగ్గడంతో బోర్ల నుంచి నీరు రావడం లేదు. వ్యవసాయ బావుల్లో పూడిక తీసినా నీటి ఊట కనిపించడం లేదు. కొన్నిచోట్ల బావుల్లో నీరొస్తున్నా మరికొన్ని చోట్ల అడుగంటుతున్నాయి. దీనికితోడు దున్నకం, విత్తనాలు, ఎరువుల కొనుగోలు, కూలీల ఖర్చులు పెరగడంతో ఎకరాకు రూ.30 నుంచి రూ.40 వేలు అవసరమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో చెరువుల్లో నీరు లేకపోవడం, దేవాదుల రిజర్వాయర్ నుంచి విడుదల చేయకపోవడంతో వరి పైర్లు ఎండిపోతున్నాయి. దిక్కుతోచని స్థితిలో రైతులు ఎండుతున్న వరి చేన్లను గొర్రెల మేత కోసం పెంపకందారులకు విక్రయిస్తున్నారు.

**వరి ఎండిపోవడంతో పశుగ్రాసానికి అమ్మిన..**

నాకున్న ఆరు ఎకరాల్లో వరి సాగు చేశా. మూడు బోరు బావులుండడంతో పొలంపైనే ఆధారపడ్డ. ఎకరానికి రూ. 30 వేలు ఖర్చుచేశా. రోజురోజుకూ భూగర్భ జలాలు తగ్గిపోతుండగా, పొట్ట దశకు వచ్చిన వరికి నీరందక ఎండిపోతోంది. విధిలేని పరిస్థితిలో గొర్రెల మేత కోసం రూ.9 వేలకు పెంపకందారులకు అమ్మిన.

*–కేలపు లక్ష్మీనారాయణ, రైతు, లింగాలఘనపురం*





శాయంపేట: పంటలు ఎండిపోతున్నాయని నీళ్లు ఇవ్వాలని ఆందోళన వ్యక్తం చేస్తున్న డీబీఎం 31 కాల్వ రైతులు

## కాల్వకు నీళ్లెప్పుడు ఇస్తరు..?

**వెయ్యి ఎకరాల్లో ఎండిపోతున్న మక్కజొన్న**

**ఎస్సారెస్పీ డీబీఎం-31 ఆయకట్టు రైతుల ఆందోళన**

శాయంపేట, మార్చి 5 : హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని కొత్తగట్టుసింగారం నుంచి శాయంపేట వరకు ఉన్న ఎస్సారెస్పీ డీబీఎం-31 కాల్వకు నీళ్లు అందక వెయ్యి ఎకరాల్లో మక్కజొన్న పంట ఎండిపోతున్నదని, వెంటనే నీరందించాలని రైతులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. కాల్వ కింది రైతులు ఎస్సారెస్పీ నీళ్లు వస్తాయన్న ఆశతో వేలల్లో పెట్టుబడి పెట్టి పెద్ద ఎత్తున మక్కజొన్న వేశారు. అయితే 15 రోజులుగా కాల్వ నీళ్లు అందడం లేదని చిన్న ఊట లెక్క వస్తుండడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆయకట్టు రైతులు మచ్చయ్య, కుమారస్వామి, సుధాకర్, అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా కాల్వ నీళ్లు వస్తున్నాయని, ఎప్పటిలాగే ఈసారి కూడా అదే నమ్మకంతో యాసంగిలో మక్కజొన్న వేస్తే నీళ్లు మాత్రం అందడం లేదని చెప్పారు. గత ప్రభుత్వంలో నీళ్లు పుష్కలంగా వచ్చేవని కానీ ప్రభుత్వం మారిన తర్వాత అధికారులెవరూ పట్టించుకోవడం లేదని, వారం గడువు పెట్టి నీళ్లు ఇస్తామంటున్నారు కానీ రావడం లేదని చెప్పారు. గతంలో పెద్దకోడెపాక, చలివాగు వరకు నీళ్లు అందేవని మరో ఐదు రోజులు పెంచి చివరి వరకు నీళ్లు ఇవ్వాలని కోరారు. సింగారం నుంచి శాయంపేట డీబీఎం-31 కాల్వపై ఆధారపడి 700 నుంచి వెయ్యి ఎకరాలు సాగు చేశామని, నీళ్లు లేక ఎండిపోతున్నదని వాపోయారు. వెంటనే నీళ్లు ఇవ్వకపోతే పంటలు ఎండిపోవడం ఖాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

**రెండు బోర్లు వేసిన**

నాకు మానేరు వాగు శివారులో మూడెకరాల భూమి ఉంది. వాగుపై ఆధారపడి సాగుచేసుకుంటున్నా. అదిప్పుడు పూర్తిగా ఎండిపోయింది. నీళ్ల పారకం ఇబ్బందిగా ఉంటే 150 ఫీట్ల లోతు బోరు వేయించిన. నీళ్లు పడలేదు. మరో బోరు వేసిన. నీళ్ల పడ్డయి. మోటర్‌తోని పొలానికి నీళ్లు పారించుకుంటున్న. బోర్లు వేసి ఆర్థికంగా నష్టపోయిన. పదేండ్లలో ఇసొంటి పరిస్థితి ఎప్పుడూ రాలె.

*– గజ్జి అశోక్, అంకుశాపురం. మొగుళ్లపల్లి మండలం, భూపాలపల్లి*



**మళ్లా నీళ్ల గోసచ్చింది**

నీళ్ల గోస మళ్ల మొదలైంది. ఎనుకటి రోజులు మళ్ల గుర్తుకస్తున్నయ్. మానేరు వాగు నీటితో పాటు బావి నీటితో నాలుగెకరాల పొలం పండేది. మానేరు ఎండిపోవడంతో బావి నీళ్లు అడుగంటినయ్. క్రేన్‌తో బావి తవ్విచ్చిన. రూ.50వేల ఖర్చచ్చింది. అయినా నీళ్లు సరిపోతయో లేదో అనే బాధ ఉంది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నపుడు నీటికి గోసలేదు. ఇప్పుడు మళ్లీ మొదలైంది. ఇప్పుడు పెట్టుబడితో పాటు బావి తవ్విన పైసలైనా వస్తే చాలనిపిస్తుంది. నీళ్లందక పంట ఎండిపోతదేమోనని భయమైతాంది.

*– నేరెళ్ల రామకృష్ణ, బూర్నపల్లి, టేకుమట్ల మండలం, భూపాలపల్లి*



**బావిలో నీటి ఊట తగ్గింది**

నాకు నాలుగెకరాల భూముంది. రెండెకరాల్లో మిర్చి, రెండెకరాల్లో పత్తి వేసిన. బావి నీటితో నాలుగెకరాలు పారేది. ఇప్పుడు నీటి ఊట తగ్గడంతో పక్క రైతుల బోర్ల నుంచి నీటిని కొనుక్కుంటున్న. ఇట్లయితే కష్టమని నేనే బోరు వేయించుకున్న. బావిలో నీళ్లు అడుగంటి పోకపోతే బోరు వేసే బాధ ఉండకపోయేది.

*– చింతల రాజమౌళి, చిట్యాల, భూపాలపల్లి*





ఎస్సారెస్పీ డీబీఎం 31 శాయంపేట వరకు చిన్న ఊటలా వస్తున్న నీళ్లు

## ఠాణాలో రౌడీ షీటర్ జన్మదిన వేడుకలు

మొగుళ్లపల్లి, మార్చి 5 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఓ ఠాణాలో ఎస్సై ఆధ్వర్యంలో రౌడీ షీటర్ జన్మదిన వేడుకలు నిర్వహించిన ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న జిల్లా పోలీస్ ఉన్నతాధికారి సదరు ఎస్సైని మందలించినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. చిట్యాల సర్కిల్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌లో రెండు రోజుల క్రితం రౌడీ షీటర్ తన జన్మదినం సందర్భంగా కొందరితో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. రౌడీ షీటర్ ఎస్సై సామాజిక వర్గానికి చెందినవాడు కావడంతో అందరు కలిసి ఠాణాలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకొన్నారు. దీనిని కొందరు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో జిల్లా ఉన్నతాధికారి ఎస్సైని పిలిపించి తీవ్రంగా మందలించినట్లు సమాచారం. కాగా అతను రౌడీషీటర్ అనే విషయం తనకు తెలియదని ఎస్సై సంజాయిషీ ఇచ్చుకున్నట్లు తెలిసింది.



కాజీపేట రైల్వే గూడ్స్ యార్డులో కాలిపోతున్న పాత బోగీలు

## పాత రైలు బోగీలో మంటలు

**కాజీపేట రైల్వే యార్డులో ఘటన.. మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది**

**భయాందోళన చెందిన ప్రయాణికులు**

కాజీపేట, మార్చి 5 : కాజీపేట రైల్వే జంక్షన్‌లోని గూడ్స్ యార్డులో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. ఓ పాత రైలు బోగీల్లో మంటలు చెలరేగగా ఫైర్ సిబ్బంది ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే గూడ్స్ యార్డులోని ఆర్-6 నంబర్ పట్టాలపై ఎనిమిది ప్రయాణికుల బోగీలను ఈ నెల 3న రాత్రి నిలిపారు. మంగళవారం ఈ యార్డు నుంచి విపరీతమైన పొగ వచ్చి ఒక్కసారిగా మంటలు లేచాయి. ప్లాట్‌ఫారానికి అతి సమీపంలో మంటలు ఎగిసిపడడంతో ప్రయాణికులు భయంతో పరుగులు తీశారు. అధికారులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఎవరైనా సిగరెట్ తాగి పడేయడం వల్ల ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఘటనపై విచారణ చేపట్టామని రూ.50లక్షల ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేశామని తెలిపారు.

## హాల్ టికెట్లు ఎప్పడిస్తరు?

**నేటి నుంచే ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలు**

**హాల్‌టికెట్లు అందక అయోమయంలో విద్యార్థులు**

హనుమకొండ చౌరస్తా, మార్చి 5 : కేయూ పరీక్షల విభాగం అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. బుధవారం నుంచి ఎల్ఎల్‌బీ పరీక్షలు ప్రారంభమవుతున్నప్పటికీ ఇంకా హాల్‌టికెట్లు ఇవ్వకపోవడంపై ఆందోళన చెందుతున్నారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుల్లో 3, 7, 9 సెమిస్టర్లు, ఐదేళ్ల ఎల్ఎల్‌బీలో 3, 7, 9వ సెమిస్టర్ల పరీక్షలు బుధవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగనున్నయి. అయితే ఇప్పటివరకు హాల్‌టికెట్లు అప్‌లోడ్ చేయక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 18నే పరీక్ష ఫీజు కట్టించుకున్న వర్సిటీ అధికారులు హాల్‌టికెట్లు మాత్రం అందజేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, హాల్‌టికెట్ల విషయమై కేయూ పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారిని వివరణ అడుగగా తెలుసుకొని పంపిస్తామని సమాధానమిచ్చారు.




కేయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్

## గంజాయి విక్రయిస్తున్న ఎక్సైజ్ ఉద్యోగి అరెస్ట్

గిర్మాజీపేట, మార్చి 5: గంజాయి విక్రయిస్తున్న ఎక్సైజ్‌శాఖ ఉద్యోగిని మంగళవారం సాయంత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ సీఐ ఎల్ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహమ్మద్ జబ్బర్‌అలీ దుబారా ఖర్చులు చేసేవాడు. తాను పనిచేస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో సీజ్ చేసి నిల్వ ఉన్న 1.090కిలోల ఎండుగంజాయిని దొంగిలించాడు. దాన్ని వరంగల్ నగరానికి తన పల్సర్‌బైక్‌పై తీసుకొచ్చి బస్టాండ్ పరిసరాల్లో విక్రయించేందుకు సిద్ధపడగా పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బందికి అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా గంజాయి విక్రయించేందుకు వచ్చినట్లు అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేయడంతోపాటు అతడి వద్ద 1.090 కిలోల ఎండు గంజాయి, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

## అన్నదాతలకు 'వీడియో' సలహాలు

- **రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌కు ఏర్పాట్లు**
- **నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి**
- **గతంలో భీమదేవరపల్లి మండలంలో విజయవంతం**

హనుమకొండ సబర్బన్, మార్చి 5 : వ్యవసాయ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం సరికొత్తగా ఆలోచిస్తున్నది. ఈమేరకు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతువేదికలే కేంద్రంగా వీడియో సలహాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు, వ్యవసాయరంగ నిపుణుల సలహాలు, సూచనలతో పాటు పంట క్షేత్రంలో రైతులు ఎదుర్కొనే సమస్యలను నేరుగా తెలుసుకొని తగిన సూచనలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. తొలి విడతగా నియోజకవర్గానికి ఒక సెంటర్‌ను ఎంపిక చేశారు. వీటిని ఆన్‌లైన్ ద్వారా నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో కావేరి సీడ్స్ ఆధ్వర్యంలో నిర్మించిన రైతువేదికలో ఈ వీడియో కాన్ఫరెన్స్ సలహాల పద్ధతిని ఏర్పాటు చేశారు. ఇది విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా దీనిని అమలు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని భావించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక కేంద్రాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా ఆన్‌లైన్ సలహాల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాకు సంబంధించి హసన్‌పర్తి మండలం పలివేల్పుల క్లస్టర్‌లో నిర్మించిన రైతువేదికలో అన్ని ఏర్పాట్లు చేయగా మంగళవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా పరిశీలించారు.



పలివేల్పుల రైతువేదికలో ప్రయోగాత్మకంగా ఏర్పాట్లు చేసిన అధికారులు